ప్రజలకు సంతృప్తికరంగా సంక్షేమ పథకాలు : ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెం తొమ్మిదో సచివాలయం పరిధి 26వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈ క్రమంలో స్థానికులు తమకు రోడ్డు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ఎంఎల్ఎని కోరారు. అలాగే వీధి దీపాల సమస్య ఉందని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎంఎల్ఎ ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైసిపి కౌన్సిలర్ చిటికెన అచ్యుతరామయ్య, వైసిపి నాయకులు మేడవరపు విద్యాసాగర్, చిప్పాడ వెంకన్న, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఛైర్మన్లు

అలంకారప్రాయమేనా.

జిల్లా పరిషత్‌లో నిబంధనలు తూచ్
ప్రజాప్రతినిధులున్నా పాలనంతా అధికారుల చేతుల్లోనే
ఛైర్మన్ లేకపోయినా వైస్‌ఛైర్మన్‌కు దక్కని అధికారం
అధికారుల ఇష్టారాజ్యంగా బదిలీలు అంటూ విమర్శలు
రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులనూ బదిలీ చేస్తున్నారని చర్చ

S.No	Name of the Vice Chairperson	Position	Date of Birth	Caste	Educational Qualification	Occupation
1	Posina Sri Lekha Member ZPTC Tallapudi	Vice Chairperson -1	09-08-1992	OC	M.Tech	Political affairs
2	Penumala Vijaya Babu Member ZPTC Pedavegi	Vice Chairperson -2	25-03-1995	SC	B.Tech Course Completed & B.Com., General	Poultry Farming

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ పాలనా వ్యవహారం ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జెడ్‌పి ఛైర్మన్ రాజీనామా చేసి 15 రోజులు గడిచినా ఆ పదవిని ఖాళీగా పెట్టడంపై ఏఒక్కరూ పట్టించుకోకపోవడం ఏమిటనే చర్చ సాగుతోంది. జెడ్‌పి వైస్ ఛైర్మన్ పదవి ఎందుకని ప్రశ్నలు విన్పిస్తున్నాయి. ఛైర్మన్ లేనప్పుడు జిల్లా పరిషత్ పాలనా బాధ్యతలు నిర్వర్తించాల్సిన వైస్ ఛైర్మన్‌ను ఎందుకు పక్కన పెట్టారనే సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులున్నప్పటికీ అధికారులే అన్నీ తామై ఏకచత్రాధిపత్యంగా జిల్లా పరిషత్ పాలన సాగించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. జిల్లా పరిషత్‌లో ఏం జరుగుతుందో వైస్ ఛైర్మన్లకు, జెడ్‌పిటిసిలకు కూడా తెలియని పరిస్థితి నెలకొందనే చర్చ నడుస్తోంది. ఛైర్మన్ పదవి ఖాళీగా ఉండటంతో జిల్లా పరిషత్‌లో అధికారులు ఇష్టానుసారంగా వ్యహరిస్తున్నారని, బదిలీల వ్యవహారమే అందుకు నిదర్శనమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 14న జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి కవురు శ్రీనివాస్ రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం వైస్‌ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. జిల్లాలో అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. ఛైర్మన్ కుర్చీని ఖాళీగా పెట్టి అధికారులు చక్రం తిప్పుతున్నారు. ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండటం కారణంగా ఎవరికి ఇన్‌ఛార్జి ఇవ్వాలో అనే సందిగ్ధంలో ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి జిల్లాపరిషత్‌కు ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉన్నప్పటికీ నిబంధనల్లో ఒకటో వైస్ ఛైర్మన్, రెండో వైస్ ఛైర్మన్ అంటూ స్పష్టంగా పేర్కొన్న పరిస్థితి ఉంది. అటువంటప్పుడు ఇంకా సందిగ్ధత ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవేళ సందిగ్ధత ఉన్నా 15 రోజులపాటు సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఎప్పటికి పరిష్కారమవుతుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అలంకార ప్రాయంగా మార్చేసి అధికారులే పెత్తనం చేయడం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇది చట్ట ప్రకారం ఏమాత్రం సమంజసం కాదనే వాదన విన్పిస్తోంది. జిల్లాలోని మంత్రులు, ఎంఎల్ఎలు సైతం దీన్ని పట్టించుకోకపోవడంపై చర్చ నడుస్తోంది.

జెడ్‌పిలో బదిలీలు ఇష్టానుసారమే..?

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఇచ్చింది. ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఒకేచోట రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని, ఒకేచోట ఐదేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే బదిలీల వ్యవహారం జిల్లా పరిషత్‌లో ఇష్టానుసారంగా జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం 140 మంది వరకూ ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తుండగా అందులో దాదాపు సగం అంటే 70 మంది వరకూ ఒకేచోట రెండేళ్ల కాలం పూర్తికాని ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులను ఏవిధంగా బదిలీ చేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. బదిలీల వెనుక పెద్దఎత్తున గూడుపుఠాని జరుగుతున్నట్లు చెబుతున్నారు. జిల్లా పరిషత్ బదిలీల్లో ఒకేచోట రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులను బదిలీ చేయడంపై జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించాలని అంతా కోరుతున్నారు. ప్రజాప్రతినిధుల జోక్యం లేకపోవడంతో జిల్లా పరిషత్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం

జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఎస్‌పి మేరీప్రశాంతి స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్‌పి నేరుగా ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా తమను సంప్రదించేందుకు వీలుగా అత్యవసర నెంబర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ కార్యక్రమానికి కూడా మంచి స్పందన వస్తుందని తెలిపారు. మహిళలు ఏ సమయంలోనైనా జిల్లాలో ఎలాంటి ఆపదలో చిక్కుకోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆమె తెలిపారు. అంతేకాకుండా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులకు ఉచితంగా భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారులతోపాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలి సమస్యను వింటున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

అమరుల ఆశయం కోసం కృషి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఉద్యమాల్లో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సోమవారం ఏలూరు పోడిశెట్టి నర్రా ఆంజనేయులు (గ్రంథాలయ వద్ద సిపిఎం అమరవీరుల వర్ధంతి సభ సిపిఎం నగర కార్యదర్శి పల్లి కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రవి మాట్లాడుతూ సమాజంలో పీడిత ప్రజానీకం కోసం ప్రజా ఉద్యమాల్లో పని చేస్తూ సిపిఎం నేతలు అనేకమంది తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారన్నారు. వారిలో ఏలూరుకు చెందిన నర్రా ఆంజనేయులు, భూరాడ అప్పారావు, తాన సింహాచలం ధన్యజీవులని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం పోరాటంలోనే దేశంలో పేదరికం, దోపిడీ లేని సమసమాజం ఏర్పడాలని కమ్యూనిస్టులు ఆశించారని, ఆ దిశగా స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించడానికి ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కానీ స్వాతంత్ర్యం అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దేశంలో పెట్టుబడిదారులను, భూస్వాములను పెంచి పోషించిందని విమర్శించారు.

ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపి ఏకంగా కార్పొరేట్ సంస్థలకు ప్రజా సంపదను మొత్తం దోచిపెట్టే పనిలో ఉందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని ప్రధాని మోడీ చేసిన ప్రమాణం పూర్తిగా విస్మరించారన్నారు. చివరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. దీంతో దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులు వంటి అనేక సమస్యలతో సతమతమవుతుందని తెలిపారు. సమాజంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం, ఇతర కమ్యూనిస్టు పార్టీలు ఆదినుండి పోరాడుతున్నాయని చెప్పారు. ఆ పోరాటాల్లో చివరకు తమ ప్రాణాలు పోయినా వెనుకాడని ధీరులు మార్క్సిస్టు కార్యకర్తలని కొనియాడారు. సిపిఎం కార్యకర్తలకు నిర్బంధాలు కొత్త కాదని నేడు ప్రభుత్వాలు కూడా ముఖ్యమంత్రి పర్యటనకు వస్తున్నారంటే సిపిఎం, ఇతర కమ్యూనిస్టులను గృహనిర్బంధం చేస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ ఆంజనేయులును 1950లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో కాల్చి చంపించిందన్నారు. ఆంజనేయులు ఏలూరు తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సభలో సిపిఎం గాంధీనగరం శాఖ కార్యదర్శి, పట్టణ మాజీ కార్యదర్శి కంది విశ్వనాథం, మహిళా నాయకురాలు చింతాడ వెంకటలక్ష్మి మాట్లాడారు. తొలుత ముందుగా పార్టీ జెండాను ఎ.రవి ఆవిష్కరించారు. అమరవీరుల స్మారక స్తూపాలకు పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సాయిబాబు, వైఎస్.కనకారావు, నాయకులు జె.గోపి, ఇస్సాకు, జి.కోటేశ్వరరావు, జి.ఏసుబాబు, ఎం.సత్యం, నర్రా ఆంజనేయులు, గ్రంథాలయ నిర్వాహకులు బొత్స సింహాచలం, శేఖర్, అల్లం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరులో..

పెదపాడు: అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం పెదపాడులోని వట్లూరు రోడ్‌లో నర్రా ఆంజనేయులు 72వ వర్ధంతిని ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. ముందుగా ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయులు ఉన్నత చదువులు చదువుకుని జిల్లా కమ్యూనిస్టు నాయకులుగా పని చేశారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అండగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలపై, నాయకులపై ఆనాటి కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ చర్యలు చేపట్టి అనేక మందిని హత్య చేసిందని గుర్తు చేశారు. నర్రా ఆంజనేయులు ట్రస్ట్ పేరుతో ఏడేళ్లుగా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ పెదపాడు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ కరీముల్లా, పిట్టా రహాయేలు, షేక్ బాషా, రెడ్డి లక్ష్మణరావు, చీకటి సత్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

పెదపాడులో..



ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు వినతిని అందిస్తున్న బాధితులు

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మండలంలోని దుద్దుకూరులో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుని సోమవారం కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ భూమికి భూమికి, పరిహారం, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ప్రతి ఒక్క నిర్వాసితుణ్ని ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 69 కేంద్రాల్లో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 10,632 మందికి 9,782 మంది హాజరు కాగా 850 మంది గైర్హాజరయ్యారు. 92 శాతం హాజరు నమోదయింది. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 9,859 మందికి 9,157 మంది హాజరు కాగా 702 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 773 మందికి 625 మంది హాజరు కాగా 148 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 3,119 మందికి 2,678 మంది హాజరయ్యారు. 441 మంది గైర్హాజరయ్యారు. 86శాతం హాజరు నమోదయింది. ఇందులో సాధారణ విద్యార్థులు 2,640 మందికి 2,274 మంది హాజరు కాగా 366 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 479 మందికి 404 మంది హాజరు కాగా 75 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు.

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని, వారి సమస్యలపై అధికారులు సత్వరం స్పందించి చర్యలు తీసుకుంటే ప్రభుత్వంపై ప్రజలకు సానుకూల ప్రభావం ఉంటుందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. స్పందన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం అందాలన్నది తమ ఆశయమన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఏలూరు నగరం తంగెళ్లమూడికి చెందిన టి.అప్పారావు వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం తరపున వినికిడి యంత్రాన్ని మంజూరు చేయాలని కోరగా, వెంటనే అక్కడే ఉన్న వికలాంగుల సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణకు దరఖాస్తును అందించి వినికిడి యంత్రాన్ని లబ్ధిదారునికి వెంటనే అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశాన్ని పరిశీలించి ఇదేరోజు అందించేలా చూడాలని జెసి బి.లావణ్యవేణిని, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్‌ను కూడా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ అత్యవసరంగా తెప్పించి లబ్ధిదారునికి వినికిడి యంత్రాన్ని అందించారు. తన సమస్యకు వెంటనే పరిష్కారం లభించినందుకు అప్పారావు అధికారయంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హత కలిగిన పేదలకు అందినప్పుడే ప్రభుత్వ ఆశయం, వాటికి సార్థకత చేకూరుతుందని కలెక్టర్ అన్నారు.

ఇద్దరు వాలంటీర్లను నియమించాలని వినతి

ప్రజాశక్తి - పోలవరం

కొత్త పైడిపాక పునరావాస కాలనీలో అదనంగా రెండు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేయాలని కొత్తపైడిపాక పునరావాస గ్రామ ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొత్త పైడిపాక పునరావాస గ్రామస్తుడు వారా ఏసు మాట్లాడుతూ 270 నివాసాలున్న తమ కాలనీకి కేవలం ఇద్దరు మాత్రమే వాలంటీర్లు ఉండటం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించడంలో జాప్యం జరుగుతుందని, అధికారులు స్పందించి మరో ఇద్దరు వాలంటీర్లను నియమించాలని కోరారు. తమ గ్రామాలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ అయిందని, 700 మంది జనాభా 600 మంది ఓటర్లు ఉన్నారని, సంక్షేమ పథకాలపై అవగాహన కోసం, గ్రామ అభివృద్ధి కోసం 200 పైబడిన నివాసాల ప్రజలకు ఇద్దరు వాలంటీర్లు సేవలందించడం వీలుపడటం లేదన్నారు. వాలంటీర్ల నియామకానికి కృషి చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల ఆందోళన

ఏలూరులో ర్యాలీ - కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో పాత్రికేయులు సోమవారం కదం తొక్కారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించారు. అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని, మీడియా కమిటీ ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విలేకరులు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా అడహక్ కమిటీ ఆధ్వర్యంలో తొలుత జిల్లా సమాచార శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అమీనా పేట, కోర్టు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జెడ్‌పి కార్యాలయం, ఇండోర్ స్టేడియం మీదుగా కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జర్నలిస్టులకు సమయం ఇచ్చి సానుభూతితో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వినతి పత్రం అందించారు. వెంటనే సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాభవానిని పిలిచి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహణపై తగు ఆదేశాలిచ్చారు. నిబంధనల ప్రకారం అందరికీ ప్రభుత్వ గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కెఎస్.శంకర్‌రావు, జిల్లా అడహక్ కమిటీ సభ్యులు కె.గంగరాజు, ఎస్‌డి జబీర్, కె.సోమశేఖర్, బిసిఎన్ ఎడిటర్ షాకీర్ బాబ్జీ, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి ప్రసాద్, దెందులూరు నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు ఎస్.రుషీరావు, కార్యదర్శి పి.వెంకట్రావు, కోశాధికారి సత్యనారాయణ, ఏలూరు కమిటీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సిహెచ్.ప్రతాప్, జాయింట్ సెక్రటరీ ఎమ్.సజ్జి, ఎర్లీ పోస్ట్ ఎడిటర్ మిల్టన్, ఎపి బిజెఎ అధ్యక్షులు టిఎన్.స్వామి, వివిధ పత్రికలు, ఛానళ్ల విలేకరులు శ్యామ్, పెద్దిరాజు, జయరామ్, విగ్నేష్, సోమేశ్వరరావు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ఏలూరులో..

పోలవరం : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్‌బాబు డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి పూణెం చినబుచ్చన్నదొర అధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఎన్నో ప్రజాసమస్యలను వెలికితీసి, సమాజానికి ఉపయోగకరంగా పనిచేస్తున్నాయన్నారు. జర్నలిస్టుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వాటిని పరిష్కరించడం లేదని, జర్నలిస్టుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ మండల ఉపాధ్యక్షులు తులసి వెంకట్రావు, ఎపిడబ్ల్యూజెఎఫ్, ప్రెస్ క్లబ్ సభ్యులు దొడ్డి సుధాకర్‌రాజు, కుంజం రాంబాబు, జల్లేపల్లి చిరంజీవి, షహీన్ షా బాషా, అయినపర్తి బుజ్జి, కనమార్లపూడి నాగేశ్వరరావు, జయవరపు ఆదిశేషు, పీతల అర్జున్, భూపతి నాగేంద్ర పాల్గొన్నారు.

పోలవరంలో..

భూమి లాక్కుంటే ఆత్మహత్యలే శరణ్యం

న్యాయం చేయాలంటూ పురుగుమందు డబ్బాలతో దళితులు ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమకు దశాబ్దాలుగా జీవనాధారమైన భూమిని అడ్డగోలుగా లాక్కుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆ కుటుంబ సభ్యులు పురుగుమందు డబ్బులతో సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని లక్కవరంలో దళిత కుటుంబాలకు చెందిన పలువురు తమకు జీవనాధారమైన వ్యవసాయ భూమిని ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పురుగుమందు డబ్బాలతో ఆ భూమి వద్ద ఆందోళనకు దిగారు. లక్కవరానికి చెందిన అరుగోల్లు బ్రహ్మయ్య 3.18 ఏకరాలుసాగు చేసుకునేవారు. బ్రహ్మయ్య మృతిచెందిన తర్వాత కొడుకులు మంగయ్య, వెంకటనరసయ్య, రాములు కొంతకాలం ఆ భూమిని సాగు చేసుకునేవారని ఆందోళనకారులు తెలిపారు. లక్కవరం డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న పెద్ద కొడుకు మంగయ్య వాటాను తన కుటుంబ ఆర్థిక అవసరాల కొరకు ఇతరులకు విక్రయించాడు. మిగతా ఇద్దరు కొడుకులల్లో ఆరుగొల్లు నరసయ్యకు తొమ్మిది మంది, రాములుకు ఐదుగురు పిల్లలున్నారు. అయితే వీరిద్దరూ తమ తదనంతరం మనుమలు, మనవరాళ్లకు పొలం చెందే విధంగా తీర్మానం చేసుకున్నారు. ఇటీవల ఈ పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారని బాధితులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఇళ్లకు ఈ పొలం అనువుగా ఉందని భావించిన అధికారులు అడ్డగోలుగా తమ పొలంలో రాత్రికి రాత్రి సరిహద్దు రాళ్లు వేయించడం దుర్మార్గమని వాపోయారు. గతంలో ఈ స్థలంపై ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ విక్టర్ ప్రసాద్‌ని బాధిత కుటుంబ సభ్యులు కలిసి తమ కుటుంబానికి జీవనాధారమైన పొలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించడం సరికాదని మొరపెట్టుకోవడంతో దళితుల ఆధీనంలో ఉన్న పొలాలను ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెట్టడం అన్యాయమని వాపోయారు. ప్రభుత్వం ఇళ్ల కోసం దళితుల భూములే కనపడుతున్నాయా అని ప్రశ్నించారు. దళిత నియోజకవర్గంలో దళితుల అభివృద్ధి ఇదేనా అని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అడ్డగోలుగా తమ భూమిని లాక్కుంటే ఆత్మ హత్యకు పాల్పడతామని బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇదిలా ఉంటే ఆందోళనకారుల కోసం వాటర్ ప్లాంట్ వద్ద నుంచి నీరు తీసుకొచ్చిన ప్లాంట్ నిర్వాహకులను పోలీసులు అడ్డుకుని, నీటిని ఇవ్వొద్దని హెచ్చరించడంతో వారు వాటర్ క్యాన్లు ఇవ్వకుండా వెనక్కి వెళ్లిపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన విషయం తెలుసుకున్న తహశీల్దార్ స్లీవ జోజి, జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జీ బాధితులతో చర్చించారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో తమ కార్యాలయానికి వస్తే పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న బాధితులు

5 నుంచి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వచ్చేనెల ఐదో తేదీ నుంచి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. అతిసార నియంత్రణపై అవగాహన పక్షోత్సవాల క్యాలెండర్లను సోమవారం ఆయన విడుదల చేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, ఇతర వైద్యసిబ్బందితో కార్యక్రమం నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో అపరిశుభ్ర పరిస్థితులు, అపరిశుభ్ర తాగునీరు, ఆహారం తీసుకోవడం తదితర కారణాలతో అతిసార బారిన పడే అవకాశం ఉందని, ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు అతిసార బారిన పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీన్ని నివారించడానికి అతిసారకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పెద్దఎత్తున ప్రజల్లో అవగాహన పెంపొందిస్తే మరణాలను పూర్తిగా అరికట్టొచ్చన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది తమ పరిధిలో అతిసార నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అతిసారకు గురైనవారికి ఒఆర్ఎస్, జింక్‌ను ముందుగానే అందుబాటులో ఉంచి, వాటిని వినియోగించే విధానాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కూడా అతిసార నియంత్రణ, నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో అతిసారవల్ల మరణాలు కలిగిన ప్రాంతాలను గుర్తించి, అందుకు గల కారణాలను విశ్లేషించి, అలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అతిసారం మరణాల నివారణపై ప్రజలను చైతన్యపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పక్షోత్సవాలను వచ్చేనెల ఐదో తేదీ నుండి 17వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, డాక్టర్ లీలా ప్రసాద్, నరేంద్ర కృష్ణ, రాజీవ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గస్తీ కాస్తున్న సిబ్బంది

కొల్లేరులో నిలిచిన చెరువు తవ్వకాలు

అటవీ శాఖాధికారుల గట్టి నిఘా

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు అభయారణ్యం ఫ్లస్ ఫైవ్ కాంటూరులో అక్రమ చెరువుల తవ్వకాలకు తాత్కాలికంగా పుల్‌స్టాప్ పడింది. కొల్లేరు ఆక్రమణలకు గురి కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అటవీ శాఖ అధికారులు కొల్లేరులో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. కొల్లేరును పరిరక్షించే విధంగా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతో పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సు మండవల్లి మండలంలో 11 గ్రామాల్లో సహజ సిద్ధంగా ఏర్పడి ఉంది. కొల్లేరును కొల్లగొట్టే విధంగా ఓ బడాబాబు రంగం సిద్ధం చేసుకొని భారీ యంత్రాలను పెట్టి చెరువు తవ్వకాలు ప్రారంభించారు. సెక్షన్ ఆఫీసర్ అడ్డుకోవడం, పొక్లెయిన్‌ను సీజ్ చేయకుండా పంపించడం, కోనపు రాజు రంగరాజు అనుచరులు దౌర్జన్యానికి దిగి విధులను అడ్డుకుని దుర్భాషలాడారని, ప్రాణ రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ముందుగా వేసుకున్న పథకంలో భాగమే అనే విమర్శలు ఉన్నాయి. దీంతో కొల్లేరులో తవ్వకో దండుకో, కొల్లేరులో గద్దలు అనే శీర్షికలతో ప్రజాశక్తిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన అటవీ శాఖ అధికారులు కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించే చర్యల్లో భాగంగా గట్టి నిఘా ఏర్పాటు చేయించి రాత్రి పగలు గస్తీ కాస్తున్నారు. దీనిపై సెక్షన్ ఆఫీసర్ రామ్మోహన్ సింగ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

క్యారమ్స్ ఆటతో జ్ఞాపకశక్తి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థుల్లో జ్ఞాపక శక్తిని పెంపొందించేందుకు చైనీస్ చెక్కర్ క్యారమ్స్ బోర్డు ఆటలు ఎంతగానో దోహదపడతాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం చైనీస్ చెక్కర్ క్యారం బోర్డు ఆడించి మెలకువలను నేర్పారు. ఈ సందర్భంగా ఎల్ఎస్. భాస్కరరావు మాట్లాడుతూ ఈ ఆటలను ఆడటం వల్ల విద్యార్థుల జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో అనేదానిపై అవగాహన కలుగుతుందన్నారు. మానసిక క్రీడల్లో చదరంగం అత్యుత్తమమైందన్నారు. క్యారం బోర్డ్ ఆడడం వల్ల మెరుగైన వ్యక్తిగా మార్చడంలో సహాయ పడుతుందని తెలిపారు. ఇలాంటి గేమ్స్ ఆడటం వల్ల విద్యార్థుల్లో మెదడు ఆరోగ్యంగా ఉండడానికి, మెరుగైన ఏకరాగ్రతకు, జ్ఞాపకశక్తికి, సామాజిక నైపుణ్యాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పర్వీన, బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ విద్యార్థి మాతంగి సుష్మ సరోజ బేతబడి, కుసుమ పాల్గొన్నారు.

ఆటలు ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు బాల్యం నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ పాలకుడు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే దేశ నాయకుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవర్చుకోవాలని తెలిపారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకుని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో విలేకరి మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సాక్షి ఆగిరిపల్లి మండల విలేకరి అస్సానుబాదు చంద్రశేఖర్(40) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. చంద్రశేఖర్ మృతి పట్ల మండలంలోని పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విలేకర్లు సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చంద్రశేఖర్ (ఫైల్)

వాలంటీర్లుకు సేవా పురస్కారాలు అందిస్తున్న ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు జెడ్పి హాలులో సోమవారం నిర్వహించిన ఏలూరు రూరల్ మండలానికి సంబంధించిన "వాలంటీర్లకు వందనం" కార్యక్రమానికి దెందులూరు నియోజకవర్గ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏలూరు రూరల్ మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను ప్రదానం చేసి, వారిని సన్మానించారు. అలాగే వైసిపి చారిత్రక విజయం సాధించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి, కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు సరస్వతి కొండలరావు, ఎంపిపి పి.శ్రీనువాసరాజు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విజయపథంలో వికాస్ విద్యాసంస్థలు

ఆధునిక డిజిటల్ విధానంతో ప్రత్యేక తరగతులు

ఛైర్మన్ వి.జగన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులకు మెరుగైన శిక్షణ కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించడంలో వికాస్ విద్యాసంస్థలు ప్రత్యేకతను చాటుకున్నాయని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడానికి అను భవజ్ఞులైన నార్త్ ఇండియన్ అధ్యాపకులను ప్రత్యేకంగా ఎంపిక చేశామని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడానికి విద్యా ర్థుల నైపుణ్యతను మెరుగు పరచడానికి డిజిటల్ విధానంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా వికాస్ స్థాపించిన రెండో ఏడాదిలోనే 2023 ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో సిహెచ్. చంద్రిక 987, ఎంపిసిలో కెఎ.శైలు 981, ఎ.లోకేష్ 983, సిహెచ్.కుశ్వంత్ 980, వి.రాజశ్రీ 976, బి.అలేఖ్య 973, వై.నమృతానాయుడు 970 అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. మరో 75 విద్యార్థులు 900 పైన మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో కెఎ.శైలు 465/470, బి.జాహ్నవి, వై.గ్రీష్మ 464/470, బైపిసి విభాగంలో సిహెచ్.తనూష 434/440, ఎ.లోకేష్ 434/440 అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. ఐఐటి, జెఇఇ, మెయిన్స్ 2023 ఫలితాల్లో వికాస్ విద్యార్థులు 26 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి నిట్‌లో ఎంపికవ్వడం మెట్టప్రాంతంలో ఇదే మొదటి ఘట్టమని సంతోషం వ్యక్తం చేశారు. మెట్టప్రాంతంలో దినదినాభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెం పట్టణంలో స్థాపించిన వికాస్ విద్యాసంస్థలు రెండేళ్లలోనే విద్యార్థుల భవిష్యత్తుకు వీలునామా- తల్లిదండ్రుల నమ్మకానికి చిరునామాగా ప్రసిద్ధి చెందిందని హర్షం వ్యక్తం చేశారు. ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షలతో పాటు ఆసక్తి కలిగిన విద్యార్థులకు సివిల్స్ తరహాలో శిక్షణ కల్పిస్తున్నట్లు జగన్ తెలిపారు. సామాజిక బాధ్యతగా వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అనేక చైతన్య కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ నూరు శాతం ఉచిత విద్యనందిస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉతీర్ణులైన విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి అతి తక్కువ సాధారణ ఫీజులతో విద్యనందిస్తున్నామని తెలిపారు. వికాస్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియేట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. అడ్మిషన్ల కోసం 77990 38777, 7799914777, 77999 11245 సంప్రదించాలని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్ తెలిపారు.

ఛైర్మన్ వి.జగన్

వికాస్ విద్యాసంస్థల భవనం

జిఎస్.లక్ష్మి

సిహెచ్.తనూష

కెఎ.శైలు

'చైతన్య'లో అత్యుత్తమ విద్యాబోధన

ప్రిన్సిపల్ మరీదు నాగరాజు

ప్రజాశక్తి - ముసునూరు

తమ పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబర్చి ఎన్నో బహుమతులు అందుకుంటున్నారని చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ మరీదు నాగరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2015-2016వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాభోధన అందిస్తున్నామన్నారు. తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అవార్డులు పొందుతున్నారన్నారు. గురుకుల పాఠశాల పరీక్షలో ఎన్నో ర్యాంకులు సాధించిన ఘనత తమ పాఠశాలదేనన్నారు. పదో తరగతి పరిక్షల్లో నూటికి నూరు శాతం విజయం సాధిస్తూ, మండల స్థాయిలోని ప్రయివేట్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభ తమ విద్యార్థులేదన్నారు. 2022-23వ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాలలో చదివిన ఎం.లావణ్య 569 మార్కులు సాధించి మండల ప్రయివేట్ పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానం పొందిందన్నారు. జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకలు, ప్లాష్టిక్ నిషేధంపై, బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజాచైతన్యం పొందుతున్న పాఠశాల చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ అని తెలిపారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థి (ఫైల్)

తమ్మిలేరుపై శాశ్వత వంతెన కలేనా..!

అమలు కాని హామీలు

ప్రభుత్వాలు మారినా ఆచరణ శూన్యం

రాకపోకలు సాగించేందుకు ప్రజల అవస్థలు

విద్యార్థులకూ తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామానికి వెళ్లాలంటే తమ్మిలేరును దాటాలి. అయితే తమ్మిలేరుపై శాశ్వత వంతెన నిర్మాణం పాలకులకు ఎన్నికల్లో వాగ్దానంగానే మిగిలిపోతుందే తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. తమ్మిలేరుపై వంతెనను నిర్మిస్తామనే హామీని ఇచ్చిన పాలకులు ఎంఎల్ఎలు, ఎంపీలుగా గెలిచారు. మంత్రి పదవులు సైతం అలంకరించిన వారు కూడా ఉన్నారు. కానీ దశాబ్దాల కాలం గడుస్తున్నా తమ్మిలేరుపై శాశ్వతమైన వంతెన నిర్మించడంలేదు. ఫలితంగా ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా, గోదావరి జిల్లాలకు చెందిన ప్రజానీకం ఇక్కడికి వచ్చి వెళ్లటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ముసునూరు-ధర్మాజీగూడెం మండలాల ప్రజానీకం తమ్మిలేరు మీదుగా రాకపోకలు సాగించాలి. ప్రతి ఏటా పాలకులు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయటం, వర్షాలు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆ వంతెన కొట్టుకుపోవటం జరుగుతోంది. మళ్లీ తాత్కాలిక వంతెన ఏర్పాటు చేస్తున్నారు. ధర్మాజీగూడెం, చింతలపూడి, ఏలూరు తదితర ప్రాంతాల ప్రజానీకం బలివే వెళ్లాలంటే ఈ తాత్కాలిక వంతెనే శరణ్యం. శాశ్వత వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటోంది. పాలకులు వచ్చి వెళ్తున్నారే తప్ప వంతెన నిర్మాణంపై దృష్టి సారించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప శాశ్వత వంతెన నిర్మించడంలేదని వాపోతున్నారు. మండలంలోని బలివే గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా విజయరాయి, ధర్మాజీగూడెం గ్రామాలకు వెళ్లే ప్రజలు నిత్యం తమ్మలేరులో దిగి పొలం పనులకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళుతుంటారు. నిత్యం బలివే, యల్లాపురం, వెంకటాపురం, రంగంపేట ఇలా పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో పంటలు తరలించేందుకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నడుం లోతు నీటిలో పుస్తకాల బ్యాగ్‌లు తడవకుండా కూడా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. తుపాన్లు, వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో కూడా తమ్మిలేరులో దిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వరద ఉధృతి ఎక్కువగా ఉంటే కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. శ్రీరామలింగేశ్వర కళ్యాణ ఉత్సవాల సమయంలో తెలంగాణా, ఆంధ్ర రెండు రాష్ట్రాల ప్రజలు ఉత్సవాలకు వచ్చే సమయంలో ప్రజాప్రతినిధులు రాకపోకలకు తమ్మిలేరుపై తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టడం, అది వర్షాకాలం సీజన్‌లో కొట్టుకుపోవడం ఏటేటా జరుగుతూనే ఉంది. ఆ తర్వాత మళ్లీ తమ్మిలేరులో దిగి నడిచే పరిస్థితి షరామామూలేనని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మర్చిపోకుండా శాశ్వత వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బలివే వద్ద విద్యార్థులను భుజాలపై ఎక్కించుకుని తమ్మిలేరు దాటిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

తమ్మిలేరుపై కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన (ఫైల్)

చెరువు కాలుష్యాన్ని అరికట్టాలి

కారకులను శిక్షించాలని, వేలంపాటపై విచారణ చేపట్టాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పంగిడిగూడెం అక్కమ్మ చెరువును కాలుష్యం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అందుగుల ప్రభాకరరావు మాట్లాడుతూ మండలంలోని పంగిడిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అక్కమ్మ చెరువులో కుళ్లిపోయిన కోడి వ్యర్థాలు, కోడి పెంట మలాస మట్టి, తదితర వ్యర్థాలు చేపలకు మేతగా వేయడంతో నీళ్లు నలుపు రంగుగా మారి కాలుష్యమయ్యాయని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు చెరువులో నీళ్లు తాగితే వైరస్, తెగులు, జబ్బులు వస్తున్నాయని వాపోయారు. అక్రమ పద్ధతిలో చెరువు వేలంపాట పెట్టి చెరువును కాలుష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పశువులకు, పొలాలకు నీరు అందిస్తున్న అక్కమ్మ చెరువు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా గ్రామ ప్రజలకు సమాచారం లేకుండా, గ్రామసభ తీర్మానం లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు పాలకవర్గం కొంతమంది వ్యక్తులు ప్రోత్భలంతో ఆ చెరువును మూడేళ్లకు రూ.9 లక్షలకు వేలంపాట వేశారని తెలిపారు. ఈ చెరువు వేలం పాట వేయడానికి సంబంధిత అధికారుల అనుమతులు లేకపోయినప్పటికీ అక్రమ పద్ధతిలో చెరువుకు వేలంపాట పెట్టారని ఆరోపించారు. చెరువుకు సంబంధించిన వేలం పాట నిధులు పంచాయతీకి జమ చేయకుండా చెరువును పాటదారులకు అప్పగించటం చట్టరీత్యా నేరమని అన్నారు. ఇప్పటికే చెరువులో కోళ్ల వ్యర్థాల వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధులకు గురవుతున్నాయన్నారు. జిల్లా అధికారులు స్పందించి చెరువు పాట నిర్వహణపై విచారణ జరపాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించరూ..!

ప్రజాశక్తి - ముసునూరు

ట్రాఫిక్ సమస్యతో ముసునూరు మండల వాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద గ్రామ పంచాయతీ డ్రెయినేజీలపై వ్యాపారులు దుకాణాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. దుకాణాల వద్దకు వచ్చే కొనుగోలుదారులు తమ సైకిళ్లు, బైకులు, కార్లు అక్కడే నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. ఆర్‌టిసి బస్సులు వచ్చే సమయంలో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. బస్సు వెళ్లేందుకు కూడా దారి ఉండడంలేదు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద కుడా ఇదే పరిస్థితి నెలకొంది. గోపవరం గ్రామంలోని నాగేంద్రపురం సెంటర్ వద్ద వ్యాపార దుకాణాలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ముసునూరు మండపం సెంటర్ వద్ద ట్రాఫిక్

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో ఉన్న శ్రీ పెద్దింట్లమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. తనిఖీ అధికారి దేవదాయ ధర్మదాయ శాఖ వి.సుధాకర్ పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి గోపాలరావు సమక్షంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను లెక్కించారు. 60 రోజులకు రూ.10,52,916 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బలే నరసింహరావు, సుబ్బరాజు, బలే సారంగధర్, వీరాకుమారి, పెద్దింట్లమ్మ సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మళ్లీ వైసిపిదే అధికారం'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు తన క్యాంపు కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, డిపో అధ్యక్షులు నీలం రవి, ప్రచార కార్యదర్శి జి.సుబ్బారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళి

ప్రజాశక్తి - ముసునూరు

పేదల సంక్షేమ పాలనకు అద్దం పట్టిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కాట్రేనిపాడు మాజీ సర్పంచి బొమ్మకంటి శ్యామలరావు అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం శత జయంతి సందర్భంగా వంద కేజీల భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాట్రేనిపాడు గ్రామ వైసిపి నాయకులు పొట్లూరి వెంకట్రావ్ తమ అనుచరులతో టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు సూర్యదేవర లక్ష్మి నరసింహారావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సొంగా ఇస్సాక్ పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో 11 కుటుంబాలకు చెందిన 40 మంది టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు మచ్చ హరిబాబు, జెడ్పిటిసి సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, సర్పంచి అమ్మిశెట్టి సంజీవరావు, ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు బజారు రాంబాబు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు అప్పారావు, సోంబసవరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వాతంత్ర సమరయోధులు సంకు అప్పారావు, కనకం సోంబసవరాజుల పోరాటాల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతాంగ, చేనేత కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిపిఐ కార్యకర్తలు సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. స్థానిక 36వ డివిజన్‌లో సంకు అప్పారావు, కనకం సోంబసవరాజుల స్మారక స్థూపం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో అప్పారావు, సోంబసవరాజుల వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. సిపిఐ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించగా సంకు అప్పారావు స్మారక విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పూలమాలవేసి నివాళులర్పించారు. కనకం సోంబసవరాజు చిత్రపటానికి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజానాట్యమండలి ఏలూరు ఏరియా కార్యదర్శి, గాయకులు తమ్మా విశ్వేశ్వరరావు విప్లవ గేయాలు పాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, కృష్ణచైతన్య, కన్నయ్య మాట్లాడుతూ సంకు అప్పారావు, కనకం సోంబసవరాజులు రాష్ట్రంలో, జిల్లాలో రైతుల, చేనేత కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన మహనీయులు అని కొనియాడారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు వైసిపి నిరసన

ప్రజాశక్తి - కైకలూరు

పేదలకు ఇస్తున్న సెంటు భూమిపై ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు సరికావని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ ఎంఎల్ఎ డిఎన్ఆర్ ఆధ్వర్యంలో వైసిపి నేతలు కైకలూరు పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో జయమంగళ వెంకటరమణ పరిశీలకులు మాదుం శివరామకృష్ణ, నాయకులు, జెడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ శాఖల డైరెక్టర్లు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.